

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 10-09-2026 సంపుటి : 08 సంచిక 82 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఎస్-400, ఎస్‌యు-57, బ్రహ్మోస్‌పై భారత్ ఫోకస్..

# మోదీ-పుతిన్ భేటీలో కీలక చర్చలు..



న్యూఢిల్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఈ నెల 11న న్యూఢిల్లీలో ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో జరగనున్న ఈ సమావేశంలో రక్షణ, వాణిజ్యం, ఇంధనం, అణుశక్తి, సాంకేతిక సహకారంపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రక్షణ రంగంలో ఎస్-400, ఎస్‌యు-57, బ్రహ్మోస్ కొనుగోళ్లపై భారత్ కీలక చర్చలు జరపనున్నట్టు సమాచారం భారత్-రష్యా రక్షణ సహకారంలో ఎస్-400 వైమానిక రక్షణ వ్యవస్థ కీలకమైనది. భారత్ గతంలో రష్యాతో ఐదు ఎస్-400 వ్యవస్థల కోసం ఒప్పందం చేసుకుంది. వాటిల్లో మూడింటిని ఇప్పటికే రష్యా నుంచి డెలివరీ తీసుకుంది. మిగిలిన రెండింటినీ ఈ ఏడాది చివర్లో అందుకోవాల్సి ఉంది. వాటి గురించి, భవిష్యత్ రక్షణ అవసరాల గురించి కూడా మోదీ-పుతిన్ చర్చించే అవకాశం ఉందిమోదీ-పుతిన్ భేటీలో అత్యంత ఆసక్తికరమైన అంశం రష్యా ఎస్‌యు-57 ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్. భారత్‌కు ఎస్‌యు-57 విమానాలను విక్రయించే అంశం చర్చల అజెండాలో ఉ ఒదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అయితే భారత్ కేవలం విమానాలను కొనుగోలు చేయడంపైనే కాకుండా టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌పై కూడా ఆసక్తి చూపుతోంది. ఎస్‌యు-57 తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌లోకి తీసుకురావడం ద్వారా దేశీయంగా తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నది ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందిఇక, భారత్-రష్యా సంయుక్త రక్షణ సహకారానికి ప్రతీకగా నిలిచిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్‌ను కూడా మరింత అభివృద్ధి చేయాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. బ్రహ్మోస్‌కు అదనపు సామర్థ్యాలు, కొత్త ఫీచర్లు జోడించి దాని పనితీరును పెంచడం గురించి చర్చలు జరుగుతున్నాయని పెస్కోవ్ తెలిపారు. ఇది కేవలం భారత సైనిక సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా భవిష్యత్తులో రక్షణ ఎగుమతులకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందిమోదీ-పుతిన్ చర్చలు రక్షణ రంగానికే పరిమితం కావు.

ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, అణుశక్తి సహకారం, అరుదైన ఖనిజాల అన్వేషణ వంటి అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. భారత్-రష్యా సంబంధాలను సాంప్రదాయ ఆయుధ కొనుగోళ్లకు మించి సంయుక్త తయారీ, టెక్నాలజీ భాగస్వామ్యం, పెట్టుబడులు వంటి రంగాల్లో మరింత విస్తరించాలనే ప్రయత్నం కనిపిస్తోంది. సెప్టెంబర్ 12-13 తేదీల్లో న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. దీనికి ఒక రోజు ముందు మోదీ-పుతిన్ ద్వైపాక్షిక భేటీ జరగనుంది.

# కలెక్టర్ల సదస్సు.. 19 అంశాలపై సీఎం చంద్రబాబు స్పెషల్ ఫోకస్



అమరావతి, సెప్టెంబర్ 9 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరుగనుంది. జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల పాటు ఈ సమావేశం నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేస్తారు.జీఎస్డీపీ, సూపర్ సిక్స్, తాగునీరు, గృహనిర్మాణం, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై మొదటిరోజు ముఖ్యమంత్రి చర్చించనున్నారు. రెండోరోజు ఈ- గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర నిధుల వినియోగంతో పాటు పలు అంశాలపై సీఎం సమీక్షించనున్నారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై కలెక్టర్లకు సీఎం మార్గనిర్దేశం చేస్తారు.మొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సీఎం చంద్రబాబు సమీక్షిస్తారు. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యారంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. రెండో రోజు సదస్సులో ఈ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీగా ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

# సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం..

## 120 ఏళ్ల నిషేధిత జాబితాలోని భూముల సమస్యకు పరిష్కారం

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సెప్టెంబర్ 9 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించారు. అంబాజీపేట మండలం మాచవరంలో గ్రౌండ్ రెంట్ భూముల్లో నివసిస్తున్న కుటుంబాలను ముఖ్యమంత్రి కలిశారు. ఈ క్రమంలో అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురం, మాచవరంలోని గ్రౌండ్ రెంట్ స్థలాలను 1908 సెక్షన్ 22ఏ1 జాబితా నుంచి విముక్తి కల్పిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.గ్రౌండ్ రెంట్ సైట్స్‌గా 22ఏ1 నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూములకు విముక్తి కల్పించి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అప్పగించారు. మాచవరంలోని జయంతి నగర్‌లో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి వారితో సీఎం మాట్లాడారు. 120 ఏళ్లుగా నిషేధిత జాబితాలో ఉండిపోయిన ఈ భూములకు విముక్తి కల్పించి పత్రాలు ఇస్తున్నట్లు వివరించారు. గ్రౌండ్ రెంట్ స్థలాలను గ్రామ కంఠం భూములతో సమానంగా పరిగణించి 22ఏ1 నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లుగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వంద శాతం గెలుపే లక్ష్యం.. నేతలకు నాదెండ్ల దిశానిర్దేశం



అమరావతి, సెప్టెంబర్ 9: స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సన్నద్ధం కావాలని నేతలకు మంత్రి నాదెండ్ల మనోహన్ పిలుపునిచ్చారు. ఈరోజు(బుధవారం) జనసేన స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... జనసేనకు బలం ఉన్న ప్రాంతాల్లో తప్పకుండా పోటీ చేస్తామని.. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు ఈసారి నేరుగా జరుగుతాయని వెల్లడించారు. గతంలో మాదిరిగా అందరూ కలిసి ఒకరిని ఎన్నుకునే విధానానికి స్వస్తి పలికినట్లు తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చామన్నారు. సందర్భం వచ్చిన ప్రతిసారీ జనసేనాని పవన్ కల్యాణ్ 'మీ కష్టాలు, మీ పోరాటాలను గుర్తు చేసుకుంటూ ఉ ంటారు' అని తెలిపారు.జనసైనికుల సంక్షేమం కోసం తొలుత రూ.ఐదు కోట్లతో ఇన్సూరెన్స్‌ను ఏర్పాటు చేశారని మంత్రి అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కౌలు రైతులు అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారని.. ఆ సమయంలో పవన్ తన సొంత డబ్బును ఆర్థిక సాయంగా అందించారని చెప్పారు. నిజాయితీకి మారు పేరుగా ఉన్న పవన్ కల్యాణ్ సారథ్యంలో అందరం పని చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో వంద శాతం ఫలితాలు సాధించాలని నేతలకు తెలిపారు. పంతాలకు పోకుండా జనసేనకు బలమున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. పార్టీ సభ్యత్వంలో కీలకంగా పని చేసిన వారికి, పార్టీ కోసం పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. 'భవిష్యత్తులో మీరే మేయర్లు, ఛైర్మన్‌లు, వార్డు సభ్యులుగా గెలుస్తారు. కానీ పార్టీ ఆదేశాలను పాటించేలా క్రమశిక్షణ ఉండాలి. అభ్యంతరాలు ఉంటే అంతర్గతంగా చెప్పండి. ఒకేసారి అందరికీ పదవులు ఇవ్వడం సాధ్యం కాదు. పార్టీ ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోండి' అని నిర్దేశించారు. ఈనెల 15న మంగళగిరికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వస్తున్నారని మంత్రి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహంపై సమీక్ష చేస్తారన్నారు. జనసేన కూటమిలో భాగస్వామ్యంతో ప్రభుత్వంలో ఉన్నామని గుర్తించాలని చెప్పారు. 12న, 15న కూటమి పక్షాల సమన్వయ కమిటీ సమావేశాలు జరుగుతాయని.. ప్రతీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో తొలివిడత ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ప్రతి ఓటు చాలా ముఖ్యమని... ప్రతి గడపకూ వెళ్లాలని ఆదేశించారు. జనసేన సభ్యత్వం ఉన్న వ్యక్తులే అభ్యర్థులుగా ఉ ండాలన్నారు. హింసను ప్రేరేపించే విధంగా రక్తం ప్రవహిస్తుందని వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏకగ్రీవంపై జగన్.. వాళ్ల పార్టీ వారినే బెదిరిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో దాడులను ఎదుర్కొన్నామని గుర్తుచేశారు. పార్లమెంటు పరిధిలో ఉన్న నేతలు ముందుగానే సమావేశం పెట్టుకుని చర్చించుకుని ప్రశాంతంగా ముందుకు సాగాలని సూచించారు. వంద శాతం విజయమే లక్ష్యంగా అందరూ కలిసి పని చేయాలన్నారు. యలమంచిలి, నర్సీపట్నంలో జనసేనకు పట్టు ఉ ందని.. కాకినాడ పార్లమెంటులో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## పల్లెటూరిలో పుట్టా.. పదవులే నన్ను వెతుక్కుంటూ వచ్చాయి: వెంకయ్య నాయుడు

నెల్లూరు, సెప్టెంబర్ 9: పల్లెటూరిలో పుట్టినప్పటికీ.. పదవులు వాటంతటవే తనను వెతుక్కుంటూ వచ్చాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. చదువురాని కుటుంబంలో జన్మించినా దేశ స్థాయిలో అటు ప్రభుత్వ, ఇటు పార్టీ పదవులు చేపట్టగలిగానని చెప్పారు. ప్రధాని నరేంద్ర 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో దేశం వికసించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయంగా భారత్ అత్యంత వేగంగా ఆర్థికంగా దూసుకెళుతోందని వెల్లడించారు.ప్రస్తుత నేతలు కొందరు దేశాన్ని చులకన చేస్తూ విమర్శలు చేయడం సరికాదని వెంకయ్య అన్నారు. పరిపాలనలో లోపాలుంటే, సమస్యలు పరిష్కారం కాకుంటే విమర్శించాలన్నారు. వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులు, మహిళలపై విమర్శలు మంచివి కాదని తెలిపారు.




# సంపాదకీయం

గురువారం 10-09-2026

## వ్యవసాయానికి డేంజర్ బెల్స్...

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క. ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోను వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణంగా 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.

## ఆ ఎమ్మెల్యేను చెప్పులతో కొట్టండి..

### మంత్రి వ్యాఖ్యలు వైరల్..

బెంగళూరు: కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి ఎస్.ఎస్.మల్లికార్జున వివాదంలో చిక్కుకున్నారు. హరిహర బీజేపీ ఎమ్మెల్యే బీపీ హరీశ్‌ను చెప్పులతో కొట్టాలని మంత్రి వ్యాఖ్యానించడం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. హరిహరలో ఓ బహిరంగ కార్యక్రమం సందర్భంగా మంత్రి మల్లికార్జున మాట్లాడినట్లుగా ఉన్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.హరిహర ప్రాంతానికి చెందిన కొందరు రైతులు సాగునీటి సమస్యను మంత్రి మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. భద్రా జలాశయం నుంచి తమ ప్రాంతానికి సాగునీటిని విడుదల చేయాలని వారు కోరారు. తమకు తాగునీటితో పాటు పశువులకూ నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము బీజేపీ ఎమ్మెల్యే బీపీ హరీశ్ అన్నను కలిసి భద్రా నీటి కోసం విజ్ఞప్తి చేయగా.. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిని కలవాలని ఆయన సూచించారని మల్లికార్జునకు రైతులు వివరించారు. ఈ వ్యాఖ్యలపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వైరల్ వీడియోలో కనిపిస్తోంది. ఎమ్మెల్యే హరీశ్‌ను 'అన్న' అని సంబోధించవద్దని రైతులకు సూచించడంతో పాటు.. ఆయనను చెప్పులతో కొట్టాలని మంత్రి అన్నట్లు వీడియోలో వినిపిస్తోంది.






మంత్రి మల్లికార్జున వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బీపీ హరీశ్ తీవ్రంగా స్పందించారు. రైతులు భద్రా నీటి కోసం మంత్రిని కలిస్తే తనపై అసభ్యకరంగా మాట్లాడారని ఆయన మండిపడ్డారు. అసభ్య పదజాలం ఉపయోగించారని, దీనికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హరీశ్ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలను కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా ఖండించారు. ఓ ప్రజాప్రతినిధిపై మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. భద్రా నీటి సమస్యతో రైతులు వస్తే సమస్యను పరిష్కరించాల్సింది పోయి రాజకీయ ప్రత్యర్థిపై దూషణలకు దిగడం సరికాదని హితవు పలికారు. కాగా, వైరల్ అవుతున్న వీడియోకు సంబంధించి పూర్తి సందర్భం, దాని ప్రామాణికతపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

## 'మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి.. అంత ధైర్యం ఎలా వచ్చింది?'





న్యూఢిల్లీ: జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది.సుప్రీంకోర్టు తన అసాధారణ అధికారాలను ఉపయోగిస్తూ జులైలో జరిగిన సీజేపీ ఆందోళనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని కేసులనూ కొట్టివేయాలని ఈ నెల 1న ఆదేశాలు జారీ చేసింది. జులై 20 నుంచి 25 మధ్య దేశ వ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఇకపై కొనసాగించరాదని, వాటిని అన్నిరకాలుగా క్లోజ్ చేస్తున్నట్టుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ఆ ఆందోళనలకు సంబంధించి భవిష్యత్తులో ఏ విద్యార్థిపైనా కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని పేర్కొంది.ఈ నేపథ్యంలో గ్రేటర్ నొయిడాకు చెందిన ఓ విద్యార్థి విషయంలో మేజిస్ట్రేట్ నోటీసు జారీచేసిన విషయాన్ని బిశ్వజిత్ భట్టాచార్య అనే సీనియర్ న్యాయవాది సుప్రీం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనను దేశంలోని విద్యార్థులపై జరుగుతున్న ఓ ప్రయోగంగా అభివర్ణించారు భట్టాచార్య. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపారు.కాగా.. గౌతమ్‌బుద్ధ యూనివర్సిటీలో చదువుతున్న ఓ విద్యార్థికి ఈ నెల 4న ఈ నోటీసు జారీ అయింది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని ప్రచారం చేయడం సహా జంతర్‌మంతర్ వద్ద జరిగిన సీజేపీ ఆందోళనలో పాల్గొనాలని ఇతర విద్యార్థులను ప్రోత్సహించారంటూ ఆ నోటీసులో ఆరోపించారు. అయితే.. మరుసటి రోజే ఆ నోటీసును ఉపసంహరించుకున్నట్లు కోర్టుకు తెలిపారు.

## ఢిల్లీలో ఆక్సిజన్ సిలిండర్ పేలుడు.. ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

దేశరాజధాని ఢిల్లీలో ఆక్సిజన్ సిలిండర్ పేలిన ఘటనలో ఒకరు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఢిల్లీ, ఓఖ్లా ఫేజ్-1లో బుధవారం ఉదయం జరిగింది. ఒక కమ్యూనిటీ హాల్‌లో ఉన్న ఆక్సిజన్ సిలిండర్ ఉదయం 11.30 గంటల సమయంలో పేలిపోయింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న ఒక వ్యక్తి మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. దీని గురించి 11.55 గంటలకు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందింది. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు చేరుకున్నాయి. ఘటనలో గాయపడిన వారిని వెంటనే అంబులెన్సుల్లో స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మరో వ్యక్తి ఘటనా స్థలంలోనే మరణించగా.. అతడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిలిండర్ పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఢిల్లీలో ఇటీవలే సత్యనికేతన్ పీజీ హాస్టల్ భవనం కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.ఈ బిల్డింగ్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ బిల్డింగ్ యజమాని హరిరాం , ఆయన భార్య ఊర్మిళ, తనయుడు మహేష్ బన్సల్‌ను పోలీసులు అరెస్టు చేయగా.. వారు ఈ బిల్డింగ్‌ను శుభం త్యాగి, శుభాన్షులకు లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. దీంతో వీరిలో శుభాన్షును పోలీసులు అరెస్టు చేశారు. శుభం కోసం గాలిస్తున్నారు. వీరు హాస్టల్ డేజ్ పేరుతో ఈ పీజీని నిర్వహిస్తున్నట్లు పోలీసులు తేల్చారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు, ఢిల్లీ మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు.





## వారిపై ఉగ్ర కేసు ఎత్తివేయలేదు.. దర్యాప్తు కొనసాగుతోంది: ఎన్ఐఏ




న్యూఢిల్లీ: అమెరికా దేశస్థుడు మాథ్యూ ఆరోన్ వాన్‌డైక్ సహా ఏడుగురు విదేశీయులపై ఉగ్రవాద ఆరోపణలను పూర్తిగా ఉపసంహరించుకోలేదని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు నిందితులపై దేశంలోకి అక్రమంగా ప్రవేశం, నివాసం, సంచరించడం వంటి నేరాలు రుజువు అయ్యాయన్నారు. దీనికి సంబంధించి ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ యాక్ట్ (ఐఎఫ్ఏ) కింద ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిందని వెల్లడించారు.భారత్‌లోని సాయుధ గ్రూపులతో సంబంధాలు, ఉగ్ర కుట్ర ఆరోపణలతో వాన్‌డైక్‌తో పాటు మరో ఆరుగురు విదేశీయులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ కేసులో మంగళవారం నాడు ఏడుగురిపై ఐఎఫ్ఏ చట్టంలోని సెక్షన్లు 21, 23 కింద ఆ సంస్థ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఇందులో ఉపా (ఊపా) నిబంధనలను ప్రస్తావించకపోవడంతో ఉగ్రవాద ఆరోపణలను ఎన్ఐఏ ఎత్తివేసిందన్న ప్రచారం మొదలైంది. ఈ ప్రచారంపై ఎన్ఐఏ వర్గాలు స్పందిస్తూ నిందితులపై ఉగ్రవాద దర్యాప్తును నిలిపివేయలేదని స్పష్టం చేశాయి. వారందరిపై యూఏపీఏ కింద దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నాయి. దర్యాప్తులో ఇప్పటివరకు స్పష్టంగా నిర్ధారణ అయిన నేరాలకు సంబంధించి మాత్రమే ప్రస్తుత ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపాయి.ఉపా కింద నేరం రుజువయ్యే ఆధారాలు దర్యాప్తులో వెలుగులోకి వస్తే తదుపరి దశలో సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉందని ఎన్ఐఏ వర్గాలు చెబుతున్నాయి. అంటే.. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో ఉపా సెక్షన్లు లేకపోవడం కేసులోని ఉగ్రవాద కోణం పూర్తిగా ముగిసిందని అర్థం కాదని పేర్కొన్నాయి. సరైన ఆధారాలు లభిస్తే భవిష్యత్తులో ఉపా నిబంధనలనూ చేర్చే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాయి.

## రోడ్డు యాక్సిడెంట్‌లో యువతి మరణం.. 26 రోజుల తర్వాత బయటపడ్డ ట్విస్ట్..





26 రోజుల క్రితం ఓ యువతి బైకుపై వెళుతుండగా యాక్సిడెంట్ జరిగింది. ఆ యాక్సిడెంట్ కారణంగా యువతి తీవ్రగాయాలపాలై ప్రాణాలు కోల్పోయింది. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ యువతిది యాక్సిడెంట్ కాదని, పక్కా ప్లాన్ ప్రకారం చేసిన మర్డర్ అని తేలింది. పరువు కోసం కన్నతండ్రి, సోదరుడు ఆమెను హత్య చేశారన్న సంగతి వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితేమూడు నెలల క్రితం అహ్మదాబాద్‌కు చెందిన సోఫియా అనే యువతి ఓ యువకుడితో ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియో సోఫియా తండ్రి మహ్మద్ ఫరూఖ్, అన్న మహ్మద్ హాబిల్ దృష్టికి వెళ్లింది. దీంతో వారు సోఫియాపై ఆగ్రహానికి గురయ్యారు. ఆ వీడియో కారణంగా సమాజంలో తలదించుకునే పరిస్థితి వస్తుందని భావించారు. ఈ నేపథ్యంలోనే తండ్రీకొడుకులు సోఫియాను చంపడానికి నిశ్చయించుకున్నారు. ఆగస్టు 12వ తేదీ రాత్రి ఆమెను బైకుపై ఊరి బయటకు తీసుకువెళ్లారు.గెల్జీపుర గ్రామం దగ్గర బైకును మట్టి మార్గంలోకి తీసుకెళ్లారు. అక్కడ హాబిల్.. సోఫియాపై ఇనుపరాడ్డుతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. తలపై మూడు సార్లు కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ సోఫియాను తండ్రీకొడుకులు మెయిన్ రోడ్డు మీదకు తీసుకువచ్చారు. అక్కడ బైకును ధ్వంసం చేశారు. హాబిల్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. గుర్తు తెలియని వాహనం తమ బైకును ఢీకొట్టిందని చెప్పాడు.సోఫియా తలకు తీవ్రమైన గాయాలు, తనకు చిన్న చిన్న గాట్లు పడ్డాయని తెలిపాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. సోఫియాను సోలా సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు సోఫియా ప్రాణాలు కోల్పోయింది. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో సోఫియా తండ్రి, సోదరుడే ఈ దారుణానికి ఒడిగట్టారని తేలింది. పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు.

## 'గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి'

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 09 : గర్భిణులు, తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషక విలువతో కూడిన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ స్వరాజ్యం అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ సెక్టార్ పరిధిలోని ఎంపీబంజరు-4 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ స్వరాజ్యం మాట్లాడుతూ.. తల్లులు, బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. గర్భిణులు తమకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.




## జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం

కాకినాడ, సెప్టెంబర్ 9, జనసేనలో స్తబ్దత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్దత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్దత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కళ్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కల్యాణ్ మత్రవే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు. 2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు కార్యకర్తల్లో గర్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నాదెండ్ల మనోహర్, నాగబాబు మరియు ఇతర ముఖ్య నేతలు పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుతూ, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ నైరాశ్యానికి తావులేకుండా చూస్తున్నారు. జనసేన బలం వారి అంకితభావం గల జనసైనికులు, వీరమహిళలు. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళు_న్నారు. పార్టీ ఎదుగుదల క్రమంలో ఇప్పుడు పవన్ కల్యాణ్ ఈ నైరాశ్యాన్ని పారదోలాలంటే స్వయంగా పూనుకోవాలి. అలాగే ఆగస్టు 15వ తేదీ నాటికి నియమిస్తామన్న కమిటీల నియామకాన్ని వెంటనే చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నఅభిప్రాయం వ్యక్తమవుతుంది.

## కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా

విజయవాడ, సెప్టెంబర్ 9, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే. ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గేనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.



# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

విజయవాడ, సెప్టెంబర్ 9,ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు. సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు. వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా

కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.


# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు

విజయవాడ, సెప్టెంబర్ 9,మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది. ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్-టు-కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు

చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి. డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది. ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

# రెబల్స్ డేంజర్ బెల్స్


తిరుపతి, సెప్టెంబర్ 9, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కడా పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది. అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లు


విజయవాడ, సెప్టెంబర్ 9, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది. ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది. మరోవైపు, ఆదాయ మార్గాలను పెంచుకోవడంలోనూ, సంపద సృష్టించే మూలధన వ్యయం సాధించడంలోనూ ఆశించినంత వేగం కనిపించడం లేదు. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఈ పరిణామానికి దారితీసింది. ఈ తరహా లోటు నిరంతరం పెరిగిపోతే రాష్ట్ర భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది.




సంక్షేమ పథకాలు లేదా రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం తెచ్చిన అప్పుల వల్ల మూలధన సృష్టి నిలిచిపోయి అభివృద్ధి కుంటుపడుతుంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి రావడం వల్ల రాష్ట్రం రుణ సంక్షోభం దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. పైగా, క్రెడిట్ రేటింగ్‌లు తగ్గిపోయి భవిష్యత్తులో కొత్త అప్పులు పుట్టడం కూడా కష్టమవుతుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కేవలం అప్పులపై ఆధారపడటం తగ్గించి, కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా పన్ను ఆదాయాన్ని పెంచుకునే ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఉత్పాదకేతర ఖర్చులను అదుపు చేస్తూ, సంపదను సృష్టించే మూలధన రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ ఫలితాలు వచ్చే సరికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## శుక్రవారం అమావాస్య సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ సెప్టెంబర్ 9 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శుక్రవారం అమావాస్య



సందర్భంగా సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి శత్రు నివారణ, బాలగ్రహ దోష నివారణ, శని గ్రహ దోష నివారణ, బుద్ధి,బలం,యశో,ధైర్యం, కార్యసిద్ధి, కొరకు ఉదయం 10 గంటలకు సింధూరార్చన జరుగును. పూజలో పాల్గొన్న భక్తులకు ఆంజనేయ స్వామి డాలరు సింధూరం ప్రసాదంగా ఇవ్వబడును. నరదృష్టి కి గుమ్మడికాయ పూజ చేసి ఇవ్వబడును.రుసుము 250-/గుమ్మడికాయ -300/- సంప్రదించవలసిన నెం :- అశోక్కుమారాచార్యులు 9032577369.ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777

## పింఛన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 9: పట్టణంలో ప్రజలకు మున్సిపల్ సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశంపై మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న బుధవారం పలు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 8వ వార్డు బాల్కొండాల్, 6వ వార్డు జగజ్జనని నగర్ సచివాలయాలను సందర్శించి సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.అనంతరం 39వ వార్డు రోజాకుంట సచివాలయాన్ని సందర్శించిన కమిషనర్, నూతన పింఛన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత ఉన్న వారికి పింఛన్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాలిక ఆచూకీ కోసం విజ్ఞప్తి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 9: నంద్యాల జిల్లా నంద్యాల మండలం చాబోలు నుంచి నంద్యాలకు వచ్చే హైవే గ్రామ పరిసర ప్రాంతాల్లో ఈ బాలిక కనిపించిందని అధికారులు తెలిపారు. బాలికను రక్షించి, సంరక్షణ నిమిత్తం బాలల సంక్షేమ సమితి ముందు హాజరుపరిచారు. విచారణలో తన పేరు దుర్గ భవాని, స్వస్థలం మంగళగిరి అని తెలిపింది. ప్రస్తుతం బాలిక నంద్యాల జిల్లాలోని బాలసదనంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.బాలికను గుర్తించిన వారు తగిన ఆధారాలతో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి లేదా జిల్లా బాలల సంరక్షణ అధికారిని సంప్రదించాలని కోరారు. వివరాలకు 8919334858 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.



## చైర్మన్ బరిలో ఎస్డీపీఐ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 9: నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవికి పోటీ చేసే అంశంపై ఎస్డీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ ఎన్నికల వ్యూహం, వార్డు స్థాయి కమిటీల ఏర్పాటు, అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంపై విస్తృతంగా చర్చించారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులు నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల నమ్మకాన్ని పొందేలా సమష్టిగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సమావేశంలో ఎస్డీపీఐ రాష్ట్ర, నంద్యాల జిల్లా, అసెంబ్లీ నాయకులతో పాటు మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.



# నిత్యావసర ధరలకు కళ్లెం వేయాలి!--

### రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 9: పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నంద్యాలలో పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ చౌక్ నుంచి కల్పనా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, గాంధీ చౌక్ వద్ద కూరగాయల దండలు




ధరించి వినూత్నంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ బియ్యం, పప్పులు, నూనె, చక్కెర, కూరగాయలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో సామాన్యులపై తీవ్ర భారం పడుతోందన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకపోయినా ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి పేదలకు సబ్సిడీపై సరుకులు అందించాలని కోరారు. నిత్యావసరాలపై పన్నుల భారాన్ని తగ్గించాలని, సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ప్రసాద్, నాగ రాముడు, సోమన్న, రజిత, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, ధనుంజయ్, భూమని శ్రీనివాసులు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవలు వేగవంతం చేయాలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబరు 9: ప్రజలకు రెవెన్యూ సేవలను సత్వరంగా, పారదర్శకంగా అందించడంతో పాటు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో కలిసి



రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. 22ఏ నిషేధిత భూములు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, రీ-సర్వే, రెవెన్యూ సేవలు, ఇళ్ల స్థలాల దరఖాస్తులు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఇళ్ల స్థలాల కోసం వచ్చిన 17,574 దరఖాస్తుల్లో 5,355 అర్హత పొందగా, 7,627 అనర్హత పొందాయని, మరో 4,592 పరిశీలనలో ఉన్నాయని అధికారులు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి గ్రామంలోని ప్రభుత్వ, అసైన్‌మెంట్, పోరంబోకు, ఆక్రమణలు, కోర్టు వివాదాల్లో ఉన్న భూముల వివరాలతో సమగ్ర డేటా సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌కు అవసరమైన భూమిని గుర్తించి 15 రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని పాణ్యం తహసీల్దార్‌ను ఆదేశించారు.భూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్లు, ఆర్డీఓలు జవాబుదారీతనంతో వ్యవహరించాలని జేసీ సూరజ్ ధనుంజయ్ సూచించారు. ఆరు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించాలని, ఉత్తమ పరిష్కార విధానాలను 'గుడ్ ప్రాక్టీసెస్'గా నమోదు చేసి ఇతర ప్రాంతాల్లో అమలు చేయాలని తెలిపారు.సమీక్షలో డీఆర్వో రామునాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరామ్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో "భక్తి శ్రద్ధలతో వరుణ యాగం".....

దేశంలో ఏర్పడిన భయంకర ఎల్లినో సమస్య వల్ల రాష్ట్రంలోనూ తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన ఈ సందర్భంలో రాబోయే గణేష్ మహోత్సవాలను దిగ్విజయంగా ప్రారంభించుకున్నతర్వాత చేయబోయే నిమజ్జన కార్యక్రమం కోసం కర్నూలు నగరం నడిబొడ్డున ఉన్న వినాయక ఘాటు మీదుగా ప్రవహించే కర్నూల్ కడప కెనాల్ లో నిమజ్జనం చేసే ఆనవాయితీ చాలా సంవత్సరాలుగా జరుగుతున్నది అయితే ఈ కెనాల్ కు కర్నూలు సుంకేసుల బ్యారేజ్ నుంచి నీరు అందాల్సి ఉంది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల సుంకేసుల నీరు లేక వట్టిపోయిన సందర్భంలో కెనాల్ కు నీరు వచ్చే అవకాశమే లేదని ప్రభుత్వం వేరే చోట్ల నిమజ్జనం ఏర్పాట్లు చేస్తూ ఉన్నది అయితే గతంలో కూడా ఇటువంటి తీవ్ర వర్షాభావ పరిస్థితులు వచ్చినప్పుడు వరుణ యాగం చేస్తే వర్షాలు కురిసి తిరిగి సమృద్ధిగా జలాలు కేసీ కెనాల్ లో ప్రవహించిన సందర్భాలు ఉన్నాయి ఆ కారణంగానే ఈరోజు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ సంవత్సరము కూడా సెప్టెంబర్ 22 నాటికి మంచిగా వర్షములు కురిసి వినాయక ఘాట్ నందు నీరు సమృద్ధిగా లభ్యమై వినాయక నిమజ్జన ఉత్సవము అంగరంగ వైభవముగా జరగవలనని సంకల్పంతో .....పర్జన్య సహిత వరుణ యాగం,వరుణ దేవత పూజ, ఆవాహనము ,వరుణ జపములు, విరాటపర్వ పారాయణము, ఋష్యశృంగ పూజ, వరుణ హోమము, పూర్ణాహుతి శ్రీ శృంగ మహర్షుల వారికి పాయస అభిషేకం, రుద్రాభిషేకం, జలాధివాస వరుణ మంత్ర జపం, మహా వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించబడింది . అనంతరం శ్రీ గణేష్ మహోత్సవ కేంద్రం సమితి శ్రీ పరాభవ నామ సం. సావనీర్ (పుస్తకం) ఉపాధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి గారు శ్రీమతి విజయ మనోహరి, విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి , గణేష్ మహోత్సవ కేంద్ర సమితి రాష్ట్ర కార్యదర్శి శ్రీ గోరంట్ల రమణ, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ మోక్షే శ్వరుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి నాగఫణి శాస్త్రి, సంఘటన కార్యదర్శి మామిళ్ళపల్లి రాజేష్, జిల్లా ప్రచార కార్యదర్శి మాళిగి భాను ప్రకాష్ నగర అధ్యక్షులు సారాయి రంగస్వామి, నగర కార్యదర్శి గిరిరాజ వర్మ, గూడా సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కార్యాలయం కార్యదర్శులు గంజి శివరాం సందడి మహేశ్వర్, ఏ కోశాధికారి కాళంగిరి విజయుడు, ఈ పూరి నాగరాజు, గూడూరు గిరిబాబు , గోవిందరాజులు సందడి సుధాకర్, విజయానంద్, నగర ప్రచార కార్యదర్శి విశ్వనాథ్,కాశీ విశ్వనాథ్, కృష్ణ సింగ్, పరశురాముని రామకృష్ణ, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల అరెస్టు అక్రమం--

### వైసీపీ నాయకులు శిల్పా, ఇసాక్ బాషా--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09-: ఐ టీవీ న్యూస్ జర్నలిస్టులు నాగచంద్రుడు, సురేష్‌లను అర్ధరాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా తీవ్రంగా ఖండించారు. బాధిత జర్నలిస్టుల కుటుంబాలను పరామర్శించి వైఎస్సార్‌సీపీ తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయ ఒత్తిళ్లతో అర్ధరాత్రి సమయంలో జర్నలిస్టులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. జర్నలిస్టులు ఉగ్రవాదులా, దేశద్రోహులా అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులపై వార్తలు రాయడం జర్నలిస్టుల బాధ్యతని, వార్తలపై అభ్యంతరాలుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప కిడ్నాప్ చేసినట్లు అరెస్టు చేయడం సరికాదన్నారు.కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణిచివేస్తోందని ఆరోపించారు. జర్నలిస్టులు, సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు ఆపి, అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్వతంత్రంగా వ్యవహరించకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం సిగ్గుచేటన్నారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## కృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణకు పోస్టర్ల ఆవిష్కరణ--

### 13న ఘనంగా విగ్రహావిష్కరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 09-: నంద్యాలలో నిర్మాణం అవుతున్న విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు బలిజ సంఘం, కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో బుధవారం విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు తెలుగు ప్రజల గర్వకారణమని, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నంద్యాలలో ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బలిజ సోదరులు, కాప్స్ రాక్స్ సభ్యులు, శ్రీకృష్ణదేవరాయల అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ల విడుదల కార్యక్రమంలో కామిని మల్లికార్జున్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, కొప్పుల మురళి, శ్రీహరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో రాణించాలి.

### మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి

కర్నూల్ స్పోర్ట్స్ న్యూస్ : ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు బొబ్బిలి పట్టణం విజయనగరం జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొనే కర్నూలు జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల జట్టుకు కర్నూలు పట్టణంలోని మాంటిస్సోరి విద్యాసంస్థ క్రీడ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించేందుకు కృషి చేయాలని తెలిపారు. నిత్యం క్రీడలు సాధనం చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఉత్సాహం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జట్టుకు జిల్లా అధ్యక్షుడు కుబేర నాయుడు క్రీడా దుస్తులు స్పాన్సర్ చేసినందుకు ప్రిన్సిపాల్ జ్యోతి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రంగముని, వ్యాయామ ఉపాధ్యాయులు, పర్వేజ్, శాంతరాజ్, కోచ్ డేవిడ్, గౌతమ్ మరియు సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**